క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో గల కొత్తవలస 5వ వార్డు కొత్తపోలమ్మ రాజీవ్ కాలనీలో జరుగుతున్న డిసిల్టింగ్ డ్రైవ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్ఓ, శానిటేషన్ మేస్త్రీ, శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రెండవ రోజు 147మందికి ఈసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఎమ్మార్‌నగరం పాలిటెక్నికల్ కళాశాలలో రెండవ రోజు 147మందికి ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ విలియం క్యారీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల 10వరకు పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖపట్నానికి బస్ చార్జీ రూ.5 పెంపు

సాలూరు: సాలూరు నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు ఆర్టీసీ బస్ టిక్కెట్ ధర పెరిగింది. ఇంత వరకు సాలూరు నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు రూ.185 టికెట్ ఉండగా, అదనంగా రూ.5 పెంచి రూ.190 చేసినట్లు ఆర్టీసీ డీఎం భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. విజయనగరం –విశాఖపట్నం మధ్య గల టోల్ గేట్ వల్ల ఈ టిక్కెట్ ధర పెంచినట్లు తెలిపారు. పెంచిన ఈ ధర రెండు రోజుల నుంచి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



పోలీసులు పట్టుకున్న నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలు

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ సీఐ వాసునాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాలూరు పట్టణంలో నంబర్‌ప్లేట్లు లేకుండా నడుపుతున్న 20 ద్విచక్రవాహనాలను పోలీసులు పట్టుకున్నారు. వాటికి అపరాధరుసుము విధించడంతో పాటు, నంబర్ ప్లేట్లను వాహనాలకు వేయించారు. నంబర్‌ప్లేట్లు లేకుండా వాహనాలను నడపడం వల్ల కలిగే అనర్థాలను వాహనచోదకులకు సీఐ వివరించారు.

కానరాని చినుకు..

గుమ్మలక్ష్మీపురం: వరుణుడు కరుణించకపోవడంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. ఇదిలా ఉండగా అప్పుడప్పుడు కురిసిన వర్షానికి కొన్ని గ్రామాల్లో దుక్కులు చేపట్టిన రైతులు విత్తనాలు జల్లుకున్నారు. వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తిన నారుకు నీరు లేకుండా పోతోందని వాపోతున్నారు.

ల్యాబ్స్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి

పార్వతీపురంటౌన్: అటల్ టింకేరింగ్ ల్యాబ్స్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ కోరారు. ఈ మేరకు పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అటల్ టింకేరింగ్ ల్యాబ్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్చార్జ్‌లతో ల్యాబ్స్ పనితీరుపై శుక్రవారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలను ఒక ఇన్నోవేషన్ హబ్‌గా చేయాలన్న సంకల్పంతో అటల్ టింకేరింగ్ ల్యాబ్స్‌ను ఎంపిక చేసిన పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. రూ.25 లక్షలతో రూపొందించిన ఈ ప్రయోగశాలలో విద్యార్థులకు రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ వంటి అత్యాధునిక పరికరాలను అందచేసినట్లు చెప్పారు.

చుక్కలనంటుతున్న ధరలు

- నిత్యావసర ధరలు పైపైకి..
- పరుగులెడుతున్న పప్పుల రేట్లు
- రూ. 180 దాటిన కందిపప్పు
- కొండెక్కిన కూరగాయల ధరలు
- సామాన్యులపై ఆర్థిక భారం



బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న పప్పుదినుసులు

పాలకొండ రూరల్: నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం నుంచి పప్పు దినుసులతో పాటు చివరకు తాళింపు వేసుకోవడానికి వాడే పోపుదినుసుల ధరలు కూడా చుక్కలను తాకుతున్నాయి. వంటల్లో సర్వసాధారణంగా వాడే పప్పుదినుసుల ధరలు రోజు రోజుకు మండిపోతున్నాయి. కంది, శనగ, మినప, తదితర పప్పుల ధరలు గగన విహారం చేస్తున్నాయి. నిత్యావసర సరుకుల కొనుగోలు వినియోగదారునిపై పెనుభారం మోపుతున్నాయి. ఇటీవల పప్పుల దిగుమతులపై దిగుమతి సుంకం 15 శాతం కేంద్రం ఎత్తేసింది. దీంతో ధరలు కాస్త తగ్గాయి. ఎన్నికలు ముగియగానే ధరలు మంట పుట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రేట్లు పెరుగుతున్నాయి. నానాటికి పరుగు పెడుతున్న ధరలు మరో పది రోజుల్లో కిలోపై 20 శాతం పెరిగే అవకాశముందని వర్తకులు అంచనా వేస్తున్నారు. పది రోజుల కిందట రూ.160 పలికిన అకోలా కందిపప్పు ప్రస్తుతం 185 రూపాయలకు చేరింది. శనగపప్పు కిలో రూ.95, మినపపప్పు రూ.140, బియ్యం సోనామసూరి సాధారణ రకం ప్రారంభ ధర కిలో రూ.60 నుంచి రూ.70కి చేరింది. దీంతో సామాన్యులు సాధారణ భోజనం చేసేందుకు లెక్కలు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

తగ్గిన దిగుబడి..

గడిచిన మూడేళ్లగా అపరాల పంటలకు సంబంధించిన దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. వాతావరణ పరిస్థితుల సమతుల్యత కారణంగా దిగుబడులు తగ్గాయని అధికారులు చెబుతున్నా.. బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడమే ధరలు పెరగడానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అపరాల పంటలను ప్రోత్సహించకపోవడంతో దేశీయ పప్పుధాన్యాల ఉత్పత్తి క్షీణించింది. సాధారణ పప్పు ధరలతో పాటు జీడిపప్పు ధర కూడా పెరిగింది. ఫైన్ క్వాలిటీ ధర కిలో రూ.750 నుంచి రూ.800కు చేరింది.



కోడిగుడ్లు

కూరగాయలది అదే దారి....

పప్పుల ధరలు చూసి హడలిపోతున్న వినియోగదారుడు ఆకు కూరలు, కూరగాయలు కొనుగోలు చేద్దామన్నా అక్కడా అదే పరిస్థితి. టమాట కిలో రూ.40కు చేరింది. క్యారెట్ రూ.50 పలుకుతోంది. ఉల్లి రూ.40, వెల్లుల్లి రూ.180, అల్లం రూ.150, మిర్చి 80 రూపాయలు పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వంట నూనెల ధరలు కొంత మేర నిలకడగా ఉన్నాయి. గతంలో ఉన్న సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించడం, పామాయిల్ ఎగుమతులపై ఆంక్షలు ఉండడంతో ఈ ధర అదుపులో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పామాయిల్ లీటర్ ధర రూ.86, ఫ్రీడం రూ.110 పలుకుతోంది.

ఏం కొనలేం..



కిలో కందిపప్పు రూ.180. కిలో శనగపప్పు 90 రూపాయలు పలుకుతుంటే ఏం కొనలేని పరిస్థితి. పప్పులకు తోడు కూరగాయల ధరలు కూడా పరుగులెడుతున్నాయి. అధిక ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్లు దిగుబడులు లేవు.

కె.విశాలాక్షి, గృహిణి, పాలకొండ మండలం

గుడ్ల ధరలు పైపైకి..

ప్రతి ఇంట్లో సర్వసాధారణంగా వినియోగించే కోడి గుడ్ల ధరలు పైపైకి చేరాయి. నెల కిందట గుడ్డు ధర రూ.5.75 ఉండగా తాజాగా దీని ధర ఆరురూపాయలు దాటింది. 30 గుడ్లతో కూడిన అట్ట 15 రోజుల కిందట రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.180 దాటింది. ప్రభుత్వ పాఠశాలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంలో భాగంగా గుడ్డు అందించాల్సి ఉండడం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో వీటి వినియోగం అధికంగా ఉండటంతో డిమాండ్ పెరిగింది.

డయేరియాను నిర్మూలిద్దాం



కుసిమిలో స్టాప్ డయేరియాపై ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

- డీజీపీఓ బలివాడ సత్యనారాయణ

సీతంపేట: డయేరియా మహమ్మారిని సమూలంగా నిర్మూలిద్దామని పార్వతీపురం మన్యం జిల్లా డీజీపీఓ బలివాడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కుసిమిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి అవసరమయ్యే వనరులను సమీకరించుకోవాలని సూచించారు. అనంతరం స్టాప్ డయేరియా ర్యాలీ నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు గణేష్, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, కార్యదర్శి రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– డెంగీపై అప్రమత్తం..

సీతంపేట: డెంగీ జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు తెలిపారు. మండలంలోని పొల్ల, పొల్లకాలనీ, దుగ్గి, రాయిలంక, తదితర గ్రామాల్లో జ్వరాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



సీతంపేట:పొల్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అదనపు సీట్లకు నోచుకోని గిరిజన విద్యార్థులు

సాలూరు: గిరిజన గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయించకుండా గిరిజన సంక్షేమ గురుకుల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది జూన్ నెల నాటికి గిరిజన గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయించి భర్తీ చేసేవారని, ఈ ప్రభుత్వంలో నేటికీ సీట్లు పెంచకపోవడంతో పది ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికి నేరుగా రేషన్ సరుకులు అందించాలని, వైటీసీలో ఏర్పాటుచేసిన గిరిశిఖర గర్భిణుల వసతి గృహ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌పై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపట్ల సిబ్బంది హ్యాండ్‌వాషింగ్, తాజా ఆహారపదార్థాలు సమకూర్చడం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రాధాకాంత్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల పరిధిలో గల శుక్రవారా(డ్రైడే)న్ని పురస్కరించుకుని చేపడుతున్న కార్యక్రమాలపై డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎంల పర్యవేక్షణలో పిల్లకు చేతుల శుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు సమకూర్చడం, తాజా ఆహార పదార్థాలు, స్నాక్స్ సమకూర్చడం వంటి పనులు చేయాలని సూచించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఐసీడీఎస్ అధికారులు జారీ చేస్తున్న మార్గదర్శకాలను విధిగా పాటించాలని, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనుమతుల్లేని చేపల చెరువులకు నోటీసులు

పార్వతీపురం: అనుమతులు లేకుండా చేపల చెరువుల పెంపకం చేపట్టకూడదని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో జరుగుతున్న చేపల పెంపకం సాగుపై సమీక్ష నిర్వహించిన పిమ్మట మాట్లాడుతూ సుస్థిరమైన చేపల పెంపకం కోసం కాలుష్యం, వ్యర్థాలు లేకుండా రైతులు తమ స్వంత భూమిలో చేపల పెంపకం చేపట్టాలని తెలిపారు.

చిట్టిపులివలస రోడ్డు పూర్తి



పూర్తయిన చిట్టపులివలస బీటీ రోడ్డు

వీరఘట్టం: నాలుగు నెలల కిందట రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన చిట్టపులివలస రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ఈ పనులను ఇటీవల ప్రారంభించారు. ఐటీడీఏ నిధులతో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో చేపట్టిన ఈ రోడ్డు పనులు పూర్తికావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2014 హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ఈ రోడ్డు పాడైతే నేటికి పనులు పూర్తయ్యాయని గ్రామస్తులు తెలిపారు. ఈ రోడ్డు పనులను ఏఈ నాగభూషణరావు శుక్రవార పర్యవేక్షించారు.

ఉపాధి పనులు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

భామిని: వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయనే కారణంతో ఉపాధి పనులు నిలిపివేయరాదని.. వర్క్ డిమాండ్ మేరకు పని దినాలు కొనసాగించాలని ఉపాధి ఏపీడీ జి. శ్రీహరి అన్నారు. ఏపీఓ ఈ. తులసీదాస్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీహరి మాట్లాడుతూ, రైతుకు ప్రయోజనం కలిగే నీటి కాలువ, ఫారంపాండ్స్, హార్టికల్చర్ పనులు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోనూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు గల గిరిజనులకు 150 పని దినాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ రమణమూర్తి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



బిల్లుమడలో స్థల పరిశీలన చేస్తున్న ఏఈ సందీప్, తదితరులు

భామిని: మండలంలోని బిల్లుమడలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద వాటర్‌ట్యాంక్ ఏర్పాటుకు అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అలికాన సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్యాంక్ నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిగడాన రాజు, మండల కన్సల్టెంట్ ముచ్చర్ల తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, తదితరులు

కురుపాం : కురుపాం నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఉదయం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రత్యేక వాహనంలో.. మిగిలిన నాయకులు సాధారణ వాహనాల్లో ధూళికేశ్వర స్వామి ఆలయం నుంచి సాయిబాబా ఆలయం వరకు ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌దేవ్, దత్తి లక్ష్మణ, డొంకాడ రామకృష్ణతో పాటు ఐదు మండలాల నుంచి కన్వీనర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసారం పెంపొందించుకోవాలి



లఖనాపురంలో నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న రాజారావు

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌వైఎస్ఎస్ ట్రాన్స్‌ఫర్మేషన్ సభ్యుడు ఎస్. రాజారావు అన్నారు. మండలంలోని లఖనాపురం, ఖడ్గవలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న నవధాన్యాల పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవధాన్యాలు సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్, రైతులు సత్యనారాయణ, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాత



గరుగుబిల్లిలో బీడుగా ఉన్న పంట పొలాలు

గరుగుబిల్లి: జూలై మొదటివారం గడుస్తున్నప్పటికీ నైరుతి రుతుపవనాల జాడ కానరాకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ ఏడాది కూడా ఖరీఫ్ కలిసొచ్చే పరిస్థితి కానరావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏటా జూన్ రెండో వారం నుంచి వాతావరణం చల్లబడి వర్షాలు కురిసేవి. ఈ ఏడాది ఇంతవరకు చిరుజల్లులు మినహా భారీ వర్షం కురవకపోవడంతో రైతులు ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 12 వేల ఎకరాలలో వరి పండించనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డాక్టర్ కమల్‌నాథ్



పాలకొండ రూరల్: చిన మంగళాపురంలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది

పాలకొండ : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమల్‌నాథ్ అన్నారు. మండలంలోని కొండాపురంలో శుక్రవారం ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం..

గుమ్మలక్ష్మీపురం: వ్యక్తిగత పరిశుభ్రతతో పలు రకాల వ్యాధులు దూరమవుతాయని భద్రగిరి సీహెచ్‌సీ హెల్త్ కౌన్సిలర్ ప్రమీల అన్నారు. ఈ మేరకు ఆర్‌కేఎస్‌కే కార్యక్రమంలో భాగంగా భద్రగిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కౌమార దశలో ఉన్న బాలికలు దృఢంగా ఉండేందుకు సమతుల్య ఆహారం, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ప్రజలు రోగాలబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జామి రవి సూచించారు. అన్నవరం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ కిమిడి రాణి, పాఠశాల విద్యార్థులతో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, టీబీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ కుమారి, భారతి, కమల, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కమల్‌నాథ్



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న హెల్త్ కౌన్సిలర్ ప్రమీల

యూనిఫారాల పంపిణీ



నేరడి-బిలో విద్యార్థులకు ఇచ్చిన యూనిఫారాలతో టీచర్లు, విద్యార్థులు

భామిని: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన యూనిఫారాలను శుక్రవారం ప్రత్యేకంగా పంపిణీ చేశారు. మండలంలో ఇటీవల పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్స్‌లో యూనిఫారాలు లేకుండానే విద్యార్థులకు అందించారు. ఎంఆర్‌సీకి ఆలస్యంగా వచ్చిన యూనిఫారాలను ప్రత్యేకంగా పంపిణీ చేశారు.